సాక్షి మంచిర్యాల

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



ఉపాధి శిక్షణ నిధులు స్వాహా

ఉపాధి శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.39లక్షలు నకిలీ వేలిముద్రలతో స్వాహా చేశారు. పోలీసులు ప్రైవేటు సంస్థ నిర్వాహకులను అరెస్ట్ చేశారు. 8లో▸



క్రికెట్‌కు వెన్నుదన్నుగా..

హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఉమ్మడి జిల్లాలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /28.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది

న్యూస్‌రీల్

14మంది నామినేషన్

సాక్షి, పెద్దపల్లి/మందమర్రిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి నాలుగో రోజు సోమవారం 14మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద రమేశ్, స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గం సమ్మయ్య, ఆర్నకొండ రాజు, గడ్డం మారుతి, రాముల కార్తీక్, జుమ్మిడి గోపాల్, అంబాల మహేందర్, జనగామ నరేశ్, మందమర్రికి చెందిన ముల్కల్ల రాజేంద్రప్రసాద్, దాగం సుధారాణి, జాడి ప్రేమ్‌సాగర్, అక్కపాక తిరుపతి ఒక్కోసెట్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు గద్దల వినయ్‌కుమార్, బొట్ల చంద్రయ్య రెండేసి సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇప్పటివరకు నాలుగు రోజుల్లో 25 మంది అభ్యర్థులు మొత్తంగా 31 సెట్ల నామినేషన్ పత్రాలు అధికారులకు అందజేశారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటరు సెల్ఫీ బోర్డుల వద్ద జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఓటరు సెల్ఫీబోర్డులను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, సహాయ కార్మికశాఖ కమిషనర్ వినీతలతో కలిసి ప్రారంభించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సరఫరా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. మంచిర్యాల బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో ఓటరు సెల్ఫీలు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ సెల్ఫీ దిగి వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా అర్హత గల వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, స్వీప్ సమన్వయకర్త రాంచదర్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్, సీ-విజిల్, వీడియో పరిశీలన, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్లను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, సహాయ కార్మికశాఖ కమిషనర్ వినీతలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు.

వడ్డీతో సతమతం!

జిల్లా కేంద్రం మంచిర్యాలలో కూరగాయలు అమ్మే ఓ మహిళకు అత్యవసరంగా రూ.10 వేలు కావాల్సి వచ్చింది. తెలిసిన వారి వద్ద అప్పు పుట్టకపోయేసరికి వడ్డీ వ్యాపారిని ఆశ్రయించింది. ముందుగానే వడ్డీ కింద రూ.వెయ్యి తీసుకుని రూ.9వేలు ఇచ్చారు. అసలు వడ్డీ కలిపి పది రోజుల్లో తిరిగి మొత్తం రూ.10వేలు ఇవ్వాలి. అంటే పది రోజులకే రూ.వెయ్యి వడ్డీ తీసుకున్నారు. ఇదే తీరుగా చిరువ్యాపారులు చాలామంది నూటికి రూ.10పైనే వడ్డీ చెల్లిస్తున్నారు.

జిల్లా కేంద్రంలోని రిటైర్డు టీచర్ తన వద్దకు అప్పు కోసం వచ్చిన వారి నుంచి ఏదైనా వస్తువు కుదువ పెట్టుకుని రూ.10 వడ్డీ చొప్పున అప్పులు ఇస్తున్నారు. ఒక్క రోజు అలస్యమైనా తాకట్టు పెట్టిన వస్తువును అమ్మేసుకుంటానని బెదిరిస్తుంటాడు.



ఫైనాన్స్‌ను పరిశీలిస్తున్న లక్సెట్టిపేట ఎస్సై చంద్రకుమార్, పోలీసులు(ఫైల్)

- అధిక మిత్తిలతో ప్రజల అవస్థలు
- పేద, మధ్యతరగతి లక్ష్యంగా దందా
- వడ్డీ వ్యాపారుల తీరుతో అధికంగా నష్టం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వడ్డీ వ్యాపారులు సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. అవసరం కోసం వెళ్లిన వారి నుంచి అత్యాశతో ముక్కుపిండి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. జిల్లాలో అల్పాదాయం గల చాలామంది పేద, మధ్య తరగతి వాళ్లే వడ్డీ వ్యాపారుల చేతిలో చిక్కుతున్నారు. రోజువారీగా పని చేసే చిరువ్యాపారులు రోజువారీ సంపాదన సగం అప్పులు తీర్చేందుకు వెచ్చిస్తున్నారు. కొన్ని చోట్ల రోజువారీగా నిర్ణీత మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. అంతేగాక బంగారం, భూమి, వాహనాలు, ఇతర వస్తువులు కుదువ పెట్టుకుని డబ్బులు ఇస్తున్నారు. కరోనా ప్రభావం, లాక్‌డౌన్ తర్వాత కుటుంబాల ఆర్థిక స్థితి దెబ్బతినడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. ఇదే అదునుగా చేతిలో డబ్బులు ఉన్న వాళ్లు వడ్డీలకు తిప్పుతూ దందా చేస్తున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల్లో కేసులు సైతం నమోదయ్యాయి.

అప్పులు ఇవ్వని రుణ సంస్థలు

ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు, రుణ సంస్థలు పేద, మధ్యతరగతి ప్రజలకు అప్పులు ఇచ్చేందుకు వెనుకాడుతున్నాయి. బ్యాంకుల్లో అనేక నిబంధనలతో రుణాలు పొందడం కష్టతరంగా మారింది. వ్యక్తిగత, గృహ, పంట రుణాల వరకే రుణ పరపతి పరిమితం అవుతోంది. దీంతో కుటుంబంలో ఇతర ఖర్చుల కోసం అప్పులు ఇవ్వడం లేదు. ముఖ్యంగా షూరిటీలు వంటి నిబంధనలతో రుణగ్రహీతలకు ఇబ్బందిగా మారింది. బ్యాంకుల్లో రుణాలు పొందడం ప్రైవేటు వ్యాపారులకు సులువుగా మారింది. దీంతో అనధికార వ్యక్తుల వద్దకు రుణాల కోసం వెళ్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు అధిక మిత్తిలు వసూలు చేస్తున్నారు. ఇక కొందరు సకాలంలో డబ్బులు తిరిగి ఇవ్వలేకపోతే గొడవలు, పోలీసుస్టేషన్లలో కేసులు నమోదవుతున్న ఘటనలు ఉన్నాయి. ప్రామిసరి నోట్లు, ఖాళీ చెక్కులతోనూ కోర్టుల్లో ఇరువర్గాల కేసులు నడుస్తున్నాయి. మరికొందరు అప్పులు తీసుకుని ఎగవేయడంతోనూ ఫైనాన్షియర్లు నష్టపోతున్న వారున్నారు. దీంతో కొందరు ఆన్‌లైన్ యాప్‌ల్లోనూ రుణాలు తీసుకుంటున్నారు.

పాటచిట్టీల వ్యాపారం

లక్సెట్టిపేట: మండలంలో వడ్డీ, పాటచిట్టీలు, ఫైనాన్స్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు వ్యాపారులు తమ పలుకుబడితో ఎలాంటి అనుమతి లేకుండా రూ.లక్షల్లో చిట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పోలీసులు కొందరు వడ్డీ వ్యాపారుల ఇళ్లో సోదాలు చేసి ఇద్దరు ముగ్గురు వ్యక్తులపై మాత్రమే కేసులు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది. చిన్న చిన్న వ్యాపారులపై కేసులు నమోదు చేసి బడా వ్యాపారులను వదిలి పెట్టారని, పూర్తి స్థాయిలో సోదాలు చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసులు సోదా చేస్తున్నారనే సమాచారంతో కొందరు వ్యాపారులు ఇళ్లు, దుకాణాలకు తాళాలు వేసి వెళ్లిపోయినట్లు సమాచారం. మండలంలో నెల, రోజువారీ, ఆరు నెలలు, ఏడాది వడ్డీ లెక్కన వ్యాపారం సాగుతోంది. వందకు రూ.2 నుంచి రూ.10వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రామిసరి నోటుపై సంతకం మాత్రమే ఉంటుంది. తేదీ, డబ్బులు రాసి ఉండవు. మరికొందరు వ్యాపారులు ఇళ్లు తాకట్టు పెట్టుకుని డబ్బులు ఇస్తున్నారు. సమయానికి డబ్బులు ఇవ్వని పక్షంలో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

అధిక వడ్డీ తీసుకుంటే చర్యలు

అధిక వడ్డీ తీసుకున్నట్లు తెలిస్తే మాకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇటీవల తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేశాం.

–ఆర్.ప్రకాశ్, ఏసీపీ, మంచిర్యాల

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



దండేపల్లి: మేదరిపేట ప్రచార సభలో అభివాదం చేస్తున్న ప్రేంసాగర్‌రావు, వివేక్, వంశీకృష్ణ

- వంశీకృష్ణకు లక్ష ఓట్లకు పైగా మెజార్టీ రావాలి
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

దండేపల్లి/లక్సెట్టిపేట: పెద్దపల్లి లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని, మంచిర్యాల నియోజకవర్గంలో లక్ష ఓట్లకు పైగా మెజార్టీ రావాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం దండేపల్లి మండలం మేదరిపేటలో, లక్సెట్టిపేట పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో అభ్యర్థి వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్ని చెప్పినా పట్టించుకోవద్దని, ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఆగస్టులో రైతు రుణమాఫీ చేస్తామని అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ తన తండ్రి నుంచి తన వరకు పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్నామని, తన కుమారుడు వంశీని గెలిపించాలని కోరారు. అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరగా.. ప్రేంసాగర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డీసీసీ ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, లక్సెట్టిపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, కౌన్సిలర్లు సురేష్‌నాయక్, రందేని వెంకటేష్, సత్తవ్వ, గడుసు లక్మి, చింత సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయంతో కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం హాజీపూర్ మండల కేంద్రంలోని అటవీ శాఖ నర్సరీ ఎదురుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు మండలంలోని మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు మాధవరపు రాజేశ్వర్‌రావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

‘గెలిపిస్తే కార్మికుల గొంతుకనవుతా’

శ్రీరాంపూర్: ఈ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో కార్మికుల గొంతుకనవుతానని పెద్దపల్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఐటీ రద్దు కోసం కొట్లాడుతానని తెలిపారు. కార్మికుడిగా 26 ఏళ్లు పని చేసిన తనకు కార్మికుల కష్టాలు తెలుసన్నారు. సింగరేణిలో నేడు కారుణ్య ఉద్యోగాల ద్వారా 20 వేల మంది యువత ఉద్యోగాలు చేస్తున్నారంటే అది కేసీఆర్ పుణ్యమేనని తెలిపారు. అనంతరం కార్మికులతో కలిసి టబ్బులు నెట్టి వారితో ముచ్చటించారు. అనంతరం శ్రీరాంపూర్, సీసీసీలోని పలు కార్మికవాడల్లో కూడా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ సెంట్రల్ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, యూనియన్ బ్రాంచీ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండి రమేష్ పానుగంటి సత్తయ్య నాయకులు పాల్గొన్నారు.



ఆర్కే7 గనిపై కార్మికులతో కలిసి టబ్బులను నెట్టుతున్న కొప్పుల ఈశ్వర్, దివాకర్‌రావు

ఉపాధ్యాయులకు సిమ్‌కార్డుల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డీఈవో కార్యాలయంలో సోమవారం ఉపాధ్యాయులకు 4జీ సిమ్‌కార్డులను డీఈవో యాదయ్య పంపిణీ చేశారు. ఏడాది క్రితం 533 పీఎస్, యుపీఎస్ పాఠశాలలో చదివే విద్యార్థులకు టాబ్‌లతో బోధన, పాఠశాలలకు సంబంధించిన వివరాల నమోదుకు టాబ్‌లను ఉపాధ్యాయులకు అందజేశారు. సిమ్‌కార్డులు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. పోస్టుపెయిడ్ సిమ్ కార్డులు అందజేయడంతో సమస్యలు తొలగిపోనున్నాయి. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, చౌదరి, సత్యనారాయమూర్తి, యశోధర, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సిమ్‌కార్డులు అందజేస్తున్న డీఈవో యాదయ్య

ఓట్ల లెక్కింపు కేంద్రం సిద్ధం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి సంతోష్
- పోలీసు కమిషనర్‌తో కలిసి పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఓట్ల లెక్కింపునకు కేంద్రాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సోమవారం రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా అదనపు కలెక్టర్లు మోతిలాల్, రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లెక్కింపు కేంద్రం చుట్టూ రక్షణ కంచెలు, వాహన పార్కింగ్ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై సీపీతో సమీక్షించారు. ఎన్నికలు ముగిశాక ఈవీఎం, వీవీప్యాట్లు భద్రపర్చేలా స్ట్రాంగ్‌రూం, పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీఓ, ఏఆర్ఓ రాములు, చెన్నూర్ ఏఆర్ఓ చంద్రకళ, ఏసీపీ ప్రకాశ్, తహసీల్దార్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద గట్టి బందోబస్తు

మంచిర్యాలఅగ్రికల్చర్/చెన్నూర్‌రూరల్/కోటపల్లి: స్ట్రాంగ్‌రూంల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ సంతోష్, రామగుండం సీపీ శ్రీనివాసులు మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఈవీఎంల స్ట్రాంగ్‌రూం, కోటపల్లి మండలం రాపన్‌పల్లి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్, మంచిర్యాల ఆర్డీవో రాములు, ఏసీపీలు ప్రకాశ్, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



ముల్కల్లలో లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోశ్, సీపీ శ్రీనివాసులు, డీసీపీ అశోక్

సీఎం హామీల జల్లు

- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- ఆదిలాబాద్ బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జనజాతర సభ సక్సెస్.. ‘హస్తం’ శ్రేణుల్లో జోష్

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి హామీల జల్లు కురిపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ జన జాతర బహిరంగసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ ప్రాంగణానికి చేరుకున్న ఆయన ప్రజలకు అభివాదం చేసిన అనంతరం ప్రసంగించారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సంబంధించి అనేక హామీలు ప్రకటించారు. బోథ్ నియోజకవర్గ పరిధిలోని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కుప్టి ప్రాజెక్టును నిర్మించి రైతులకు సాగునీటిని అందిస్తామన్నారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిన తూర్పు ప్రాంతంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను నిర్మించడంతో పాటు దానికి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరిట నామకరణం చేస్తామన్నారు. ముంపు నిర్వాసితుల అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని తెలిపారు. అలాగే కేసీఆర్ నిర్లక్ష్యం చేసిన కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి దానిపై ఆధారపడ్డ ప్రజలకు సాగు, తాగునీటిని అందిస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీని ప్రైవేట్ వ్యాపారులతో మాట్లాడి తెరిపిస్తామని తద్వారా ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అలాగే జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని భరోసానివ్వడం ఈ ప్రాంత వాసుల్లో ముఖ్యంగా కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతుంది. సభ సక్సెస్‌తో పార్టీ నేతల్లో హుషారు కనిపించింది.

రెండు గంటలు ఆలస్యంగా...

ప్రత్యేక హెలికాప్టర్‌లో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకున్న సీఎం అక్కడి నుంచి రోడ్డు మార్గాన సభ వేదిక వద్దకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 11గంటలకు హాజరుకావాల్సి ఉండగా రెండు గంటలు ఆలస్యంగా 12.57గంటలకు హాజరయ్యారు. సాంస్కృతిక కళాకారుల బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపూరావు, రామారావు పటేల్, కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేశ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్, శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం



సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణ

పలువురి చేరిక

బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నుంచి పలువురు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, కలాల శ్రీని వాస్, మడావి మంగళ, మాజీ ఎంపీపీ ఆడే శీల, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి సీఎం కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

పేదింటి బిడ్డ సుగుణ : ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు తెలియనటువంటి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణపై దేవుళ్ల పేరిట విష ప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. ఏ ఒక్క రోజు తలపాగా చుట్టని, దోతి కట్టని, జంగుబాయిని దర్శించుకోని వ్యక్తి నగేశ్ అని విమర్శించారు.

ప్రశ్నించే గొంతుకనవుతా.. : ఆత్రం సుగుణ

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డైన తనను పార్లమెంట్‌కు పంపిస్తే ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటు కష్టాలు, సమస్యల పరిష్కారంలో పాలు పంచుకుంటానన్నారు. ఆడబిడ్డనైన తనను ఆదరించి ఎంపీగా గెలిపించాలని కోరుతూ కొంగుపట్టి ఓటు అభ్యర్థించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు కేసీఆర్ లాంటి దొరలే..

- నక్కు, నగేశ్‌పై సీఎం సెటైర్లు

బీఆర్‌ఎస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులపై సీఎం రేవంత్‌రెడ్డి తనదైన స్టైల్లో విమర్శలు గుప్పించారు. ‘ఆత్రం సక్కును చూశారు.. గోడం నగేశ్‌ను చూశారు.. వారు మీకు కొత్తేమి కాదు.. వాళ్ల పనితీనమేంటో కూడా మీకు తెలుసు.. మంచోడు మంచోడని మంచమెక్కిస్తే మంచమంతా పాడు చేశాడట వెనుకటికి ఆత్రం సక్కులాంటోడని’ అన్నారు. అలాగే గోడం నగేశ్ గురించి మాట్లాడుతూ బుద్ధిమంతుడని సద్దికట్టిస్తే బొడ్రాయి వద్ద భోంచేసి తిరిగి ఇంటికొచ్చి బోర్లాపడుకున్నడట.. అంటూ సామెతలను వివరిస్తూ వారిద్దరిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. నగేశ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా అన్ని పదవులు చేసిన విషయం మీకందరికీ తెలుసన్నారు. వారిద్దరు తక్కువేమి కాదని కేసీఆర్ దొర ఎంతనో ఈ గిరిజన నాయకులు అంతటి దొరలేనన్నారు. ఉదయం 11గంటలైతే తప్ప కిందకి దిగడని, సామాన్యులు చేయి కలిపితే వెంటనే జేబులో పెట్టి తుడ్చుకునే నగేశ్ లాంటి దొరలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో ఉండే దొరలైనా ఆదిలాబాద్‌లో ఉండే ఈ దొరలతో మనకేం పని అని అన్నారు. సామాన్యురాలిగా, ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆత్రం సుగుణను పార్టీ ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టిందని ఆమెను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.

బీజేపీది అసత్య ప్రచారం : మంత్రి శ్రీధర్‌బాబు



రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మతతత్వ పార్టీ బీజేపీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో లేని అంశాల ను ప్రస్తావిస్తూ అసత్య ప్రచారం చేస్తుందన్నారు. గడిచిన పదేళ్ల పాలనలో బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోలోని ఏ ఒక్క అంశాన్నైనా అమలు చేసిందా అని ప్రశ్నించారు. దేశ ప్రజలంతా దేవుళ్లను కొలుస్తారని, తాము అనేక గుడులను నిర్మించామన్నారు. కానీ దేవుడు మా వాడేనని మార్కెటింగ్ చేసుకునేలా బీజేపీ వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. అలాగే పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజలకు బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదని ఆరోపించారు.

ప్రజల సంక్షేమాన్ని కాంక్షించేది కాంగ్రెస్ : మంత్రి సీతక్క



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచేయడంతోనే బీఆర్‌ఎస్‌ను ప్రజలు పక్కనపెట్టారన్నారు. మోదీ చేసిందేమి లేకపోవడంతోనే కాంగ్రెస్‌పై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి తప్పుడు విమర్శలు చేయడం తగునా అని ప్రశ్నించారు. హిందువుల పార్టీ తమదని చెప్పుకునే మోదీ అగర్‌బత్తీలను సైతం జీఎస్‌టీ నుంచి వదల్లేదని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమాన్ని కాంక్షించేది కాంగ్రెస్ పార్టీ అని.. వారి కోసం ఆహారభద్రత, ఉపాధిహామీ, విద్యాహక్కు వంటి చట్టాలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీఎస్‌టీ పేరిట రూ.54లక్షల కోట్లు దండుకున్న ఘనత కేంద్రంలోని మోదీ సర్కారుదని మండిపడ్డారు. ప్రజలకు బీఆర్‌ఎస్, బీజేపీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 3 నెలల్లోనే 38వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని గ్యారంటీలకే రేవంత్‌రెడ్డి గ్యారంటీ అని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ కాగజ్‌నగర్ -వేంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు నుంచి రెండు రోజుల క్రితమే పడి మృతిచెంది ఉంటాడన్నారు. తెల్లని సన్నని డబ్బాలు గల బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడని, ఫ్రెంచ్ గడ్డం కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి) మార్చురికి తరలించినట్లు తెలిపారు.

టీఏ సస్పెన్షన్

మందమర్రిరూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా మందమర్రి మండలంలోని శంకర్‌పల్లి, చిర్రకుంట, పొన్నారం, మామిడిగట్టు గ్రామ పంచాయతీలకు క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)గా విధులు నిర్వహిస్తున్న వై.రాయమల్లును సస్పెండ్ చేస్తూ రెండు రోజుల క్రితం డీఆర్‌డీవో కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి కారణం లేకుండా నెలరోజులుగా విధులకు గైర్హాజర్ కావడం వల్లే సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పగరపు బిక్షపతి(38) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఇంటి సమీపంలోని డ్రెయినేజీకి చెందిన మోరిపై కూర్చుని ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

కాసిపేట: మండలంలోని కోమటిచేను వద్ద సోమవారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన తూర్పాటి మహేష్ కాసిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్‌బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రికెట్‌కు వెన్నుదన్నుగా..



మంచిర్యాల జెడ్పీ బాలుర పాఠశాల మైదానంలో బ్యాటింగ్‌లో శిక్షణ పొందుతున్న ఔత్సాహికులు



బౌలింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో డీసీఏ ఉచిత శిక్షణ
- శిబిరానికి వెల్లువెత్తుతున్న ఔత్సాహికులు
- ఎనిమిదేళ్ల తర్వాత ప్రత్యేక శిబిరాలు
- ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ఏర్పాటు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పట్టణ, గ్రామీణ ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ వేసవిలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో మూడు ప్రాంతాల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. 2016 తర్వాత అంటే దాదాపు 8 ఏళ్ల తర్వాత ఉమ్మడి జిల్లాలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది.

పూర్తిస్థాయి సౌకర్యాల మధ్య..

క్రీడాకారుల కోసం మ్యాట్‌లు, నెట్‌తోపాటు జంబో కిట్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. కేంద్రాల్లో నిష్ణాతులైన, సుశిక్షితులైన కోచ్‌లతో శిక్షణ అందించనున్నారు. కోచ్‌తోపాటు సహాయ శిక్షకులను నియమించి మెరుగైన శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు ప్రతీరోజు అల్పాహారం కింద అరటి పండు అందించడంతోపాటు మంచినీటి వసతి కల్పించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని శిక్షణ కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం, ఆదిలాబాద్‌లో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కాగజ్‌నగర్‌లో సర్‌సిల్క్ మైదానంలో క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా శిబిరాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే క్రికెట్ శిక్షణకు తాకిడి ప్రారంభం కాగా 25 నుంచి అధికారికంగా శిబిరాలు ప్రారంభించనున్నారు. నెల రోజుల పాటు అంటే మే 25వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయి. ఆసక్తిగల క్రీడాకారులు మంచిర్యాల జిల్లా క్రికెట్ కోచ్ ప్రదీప్(9440010696), ఆదిలాబాద్ ఇన్‌చార్జి అతాఉల్లాహ్(9440207473), కాగజ్‌నగర్ ఇన్‌చార్జి శ్రీకాంత్(9492333333)ని సంప్రదించి శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ తెలిపారు.

టీడీఎల్ టీ–20 లీగ్‌లో అవకాశం..

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ డిస్ట్రిక్ట్ లీగ్(టీడీఎల్) టీ–20 పోటీల్లో పాల్గొనే అవకాశం లభించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ శిక్షణ జరగనున్న నేపథ్యంలో అందరితో కలిపి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి ఉమ్మడి జిల్లా సీనియర్ జట్టుకు ఎంపిక చేస్తారు. శిబిరాల్లో రాణించే క్రీడాకారులకు ఎండీసీఏ ఆధ్వర్యంలో ఈ ఏడాదిలో హెచ్‌సీఏ నిర్వహించనున్న అండర్–14, 16, 18, 20 విభాగాలతోపాటు ఇతర టోర్నీలకు ఎంపిక చేయనున్నారు. నైపుణ్యం కనబరిచే క్రీడాకారులకు హెచ్‌సీఏ టాలెంట్ హబ్ అకాడమీల్లో ప్రవేశాలు లభించే అకవాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



క్రికెట్‌పై ఆసక్తిగల క్రీడాకారులకు ఈ వేసవిలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ కోసం ఇప్పటికే 100 మందికిపైగా పేర్లు నమోదు కాగా వివిధ ప్రాంతాల నుంచి క్రికెట్ శిక్షణకు ఆసక్తి కనబరుస్తున్నారు. శిక్షణస్థాయి పెంచి మరికొంత మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ద్వారా శిక్షణ పొందిన క్రికెట్ క్రీడాకారులు యూనివర్సిటీ, జిల్లా, అంతర్ జిల్లా స్థాయిలో ఆడారు. అండర్–23 ప్రాబబుల్ జట్టులో చోటు సంపాదించిన వారు ఉండగా ఇంకా రంజీల్లో ఆడిన వారు కూడా ఉన్నారు. ప్రత్యేక శిక్షణ అందిస్తున్న ఈ వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రదీప్, జిల్లా కోచ్, క్రికెట్ అసోసియేషన్

వాల్టా చట్టం.. అక్రమాలకు చుట్టం

- యథేచ్ఛగా బోర్ల తవ్వకం
- అవగాహన లేక అప్పులపాలవుతున్న రైతులు
- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న దందా



నెన్నెల మామిడితోటలో వేస్తున్న బోరు

నెన్నెల(బెల్లంపల్లి): భూగర్భ జలాలను సంరక్షించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన వాల్టా చట్టం కొందరికి చుట్టంగా మారిపోయింది. ప్రజాప్రతినిధుల సహకారం.. అధికారుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో సుమారు ఇప్పటి వరకు 200 బోర్ల తవ్వకాలు జరిగినట్లు సమాచారం. అక్రమార్కులకు ఈ దందా కాసులు కురిపిస్తోంది. కానీ నీటి వినియోగం తారాస్థాయికి చేరడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వాల్టా చట్టాన్ని అమలు చేయడంలో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో బోర్ల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

ఒకదాని తర్వాత మరొకటి..

ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో బోర్లలో నీరు అడుగంటిపోయింది. తాగునీటికి సైతం కష్టంగా మారింది. సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు అనుమతులు తీసుకోకుండా బోర్లు తవ్వేస్తున్నారు. మరికొందరు నీరు రాకపోవడంతో బోరుపైపులను మరింత కిందికి దించుతున్నారు. ఇష్టానుసారంగా ఈ తతంగం జరుగుతోంది. మరోవైపు రైతులకు అవగాహన లేకుండా బోర్ల తవ్వకం చేపడుతుండటంతో నీరు పడక అప్పుల పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఎలాగైనా సరే పంటలు పండించుకోవాలనే ఆశతో రైతులు అప్పులు చేసి మరీ బోర్లు వేసుకుంటున్నారు.

అమలుకాని నిబంధనలు ..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోరుకు బోరుకు మధ్య కనీసం 500 మీటర్ల దూరం ఉండాలి. భూగర్భ జలమట్టం ఆధారంగా అధికారులు అనుమతులు ఇవ్వాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. రైతులు బోర్లు వేసి నీరు పడకపోవడంతో ఆర్థికంగా చితికిపోరాదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం నిబంధనలు విధించింది. కానీ అవేం పట్టించుకోకుండా రైతులు యథేచ్ఛగా బోర్లు వేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

నిబంధనలు ఇలా...

- మొదట భూగర్భ జలశాఖ అధికారులు నీరు ఎంత లోతులో ఉందో సమీక్షించి అనుమతి ఇవ్వాలా? వద్దా? అనేది నిర్ధారిస్తారు. భూగర్భ జలశాఖ అనుమతి పొందాకే బోరు తవ్వకం మొదలు పెట్టాలి.
- అనుమతి ఇస్తే తహసీల్దార్ వద్ద నుంచి ఫామ్–2 తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- అనంతరం రెవెన్యూ సిబ్బంది గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తారు. బోరు బోరుకు మధ్య 500 మీటర్ల దూరం ఉంటేనే తవ్వకానికి అనుమతి ఇస్తారు.
- విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి ట్రాన్స్‌కో అధికారుల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి.

అతిక్రమిస్తే చర్యలు



వాల్టా చట్టాన్ని అతిక్రమించి బోర్ల తవ్వకం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బోరు వేయాలంటే ఎవరైనా తప్పకుండా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ఎక్కడైనా బోర్లు వేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, తహసీల్దార్, నెన్నెల

చోరీ కేసులో నిందితుల అరెస్టు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఓ వ్యాపారి వద్ద ఉన్న డబ్బులను దొంగిలించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా రేకుర్తికి చెందిన ఆంజనేయులు అనే చింతగింజల వ్యాపారి ఈ నెల 20న ఆటోలో బెల్లంపల్లికి వచ్చి రాత్రి 7:30 గంటల ప్రాంతంలో చాడేశ్వరి ఏరియాలో ఉన్న వైన్ షాపులో మద్యం సేవించి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో పడుకున్నాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు అతన్ని కొట్టి అతని వద్ద ఉన్న రూ.10,200 ఎత్తుకెళ్లారు. జరిగిన ఘటనపై బాధితుడు బెల్లంపల్లి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై రమేశ్ దర్యాప్తు చేపట్టారు. బెల్లంపల్లికి చెందిన సిరిగి మహంకాళి, లెక్కల శివప్రసాద్, మోట సింహాచలంను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3 వేలు నగదు, ఓ మోటారు సైకిల్, ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన బాధ్యత యూనియన్‌లోని ప్రతి ఒక్కరిపై ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్ లోని ఆఫీషర్స్ క్లబ్‌లో బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అధ్యక్షతన ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ సింగరేణిలో నూతన బొగ్గు గనులకై యాజమాన్యంతో చర్చిస్తున్నామన్నారు. గతంలో సింగరేణికే నేరుగా బొగ్గు బ్లాకుల కేటాయింపు జరిగేదని, ప్రస్తుతం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేస్తామని అంటోందన్నారు. సింగరేణి గుర్తింపు సంఘంగా గెలిచి నెలలు గడుస్తున్నా ఆర్‌ఎల్‌సీ నుండి గుర్తింపు పత్రం అందించలేదన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీఎం పర్సనల్ శ్యాం సుందర్‌రెడ్డి, గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, చంద్రశేఖర్, రాజేశ్, శివరావు, ఆనంద్, రాజయ్య, కిరణ్‌బాబు, పిట్ కార్యదర్శులు రామయ్య, అశోక్, రమేశ్, యుగేందర్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు ఆత్మీయ సన్మానం

చెన్నూర్: ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జి.సుబ్బారాయుడును సోమవారం చెన్నూర్ క్లస్టర్ పరిధిలోని చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. ప్రజల సహకారం, తోటి ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తే సర్వీసులో ఎలాంటి ఒడిదుడుకులు ఉండవన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి నీరజ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. కార్యక్రమంలో వైద్యులు విజయ పూర్ణిమ, అరుణశ్రీ, కృష్ణతేజ, సత్యనారాయణ, రాజేశ్, సూపర్‌వైజర్లు జగదీశ్, రాజారెడ్డి, రాంశెట్టి బాపు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

మావోయిస్టుల తలకు వెల

- పోస్టర్లు విడుదల చేసిన సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: మావోయిస్టుల తలకు పోలీసు శాఖ వెల కట్టింది. 'సమాచారం మాకు.. బహుమతి మీకు' అంటూ ప్రచారం చేపట్టింది. 'ఇక మారు సోదర' అంటూ కరపత్రాలు, పోస్టర్లను సోమవారం రామగుండం కమిషనరేట్‌లో సీపీ శ్రీనివాసులు విడుదల చేశారు. సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం అందిస్తామని, పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ సందర్భంగా 22 మంది మావోయిస్టుల ఫొటోలతో కూడిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. సీపీ రామగుండం 08728 271333, మంచిర్యాల డీసీపీ 8712656503, ఎస్‌బీ 8712656596 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాసులు

ఎమ్మెల్యేపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. ఈ నెల 12న రంజాన్ సందర్భంగా ఈద్గాలోకి వెళ్లి మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని భరోసా కల్పించే విధంగా ప్రసంగించినందుకు ఎఫ్‌ఎస్‌టీ టీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

- పీఎంకేకే స్కీంకు సంబంధించి రూ.39 లక్షలు కాజేసిన వైనం
- ప్రైవేటు సంస్థ నిర్వాహకుల అరెస్టు
- కేసు దర్యాప్తు చేస్తున్నాం : రామగుండం సీపీ శ్రీనివాసులు

ఉపాధి శిక్షణ నిధులు స్వాహా



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ఉపాధి శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.39లక్షలు నకిలీ వేలిముద్రలతో స్వాహా చేశారు.. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పాటైన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వాకమిది. కూపీ లాగిన పోలీసులు నిర్వాహకులను అరెస్ట్ చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌశల్య కేంద్ర్(పీఎంకేకే) పథకం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తోంది. భోపాల్ కేంద్రంగా నిర్వహిస్తున్న అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ సంస్థకు దేశంలోని నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చే కాంట్రాక్టు అప్పగించింది. ఈ క్రమంలో ఆ సంస్థ హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి మంచిర్యాల, హుజూర్‌నగర్, జనగామల్లో శిక్షణ కేంద్రాలు కొనసాగిస్తోంది. మంచిర్యాల సెంటర్ నిర్వాహకులు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లికార్జున్ 2020 నుంచి ఏడాదికి 320 మంది చొప్పున ప్రతీ సెంటర్‌లో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఒక్కో అభ్యర్థికి కేంద్ర ప్రభుత్వం రూ.13 వేలు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది నుంచి ఏటా 720 మందికి శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. అభ్యర్థుల హాజరు ఆధారంగా నిధులు విడుదల చేస్తోంది.

300 మందికి 50 మందే హాజరు..

మంచిర్యాల కేంద్రంగా నిర్వహిస్తున్న సెంటర్‌లో ఈ ఏడాది 300మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ, రోజూ సగటున 50 మంది మాత్రమే హాజరవుతున్నారు. దీని ఆధారంగా నిధులు విడుదలవుతున్నాయి. రాబడి తగ్గడంతో సంస్థ ప్రధాన కేంద్రం నిర్వాహకులు సాహిల్ వలీ, హైదరాబాద్ ఆఫీస్ ఇన్‌చార్జి అవునూరి శ్రీనివాస్ సూచన మేరకు మంచిర్యాల సెంటర్ ఇన్‌చార్జి మల్లికార్జున్ హాజరు శాతం పెంచేందుకు తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నారు. తనకు పరిచయం ఉన్న నర్సంపేటకు చెందిన విజయ్ సూచన మేరకు అదే ప్రాంతానికి చెందిన సలీం జాఫర్, వెంకటేశ్వర్లు సాయంతో 250 మంది అభ్యర్థుల ఫేక్ ఫింగర్ ప్రింట్లు రూపొందించారు. గైర్హాజరైన అభ్యర్థుల అటెండెన్స్‌ను బయోమెట్రిక్ మిషన్‌లో నమోదు చేసి అభ్యర్థులందరూ హాజరైనట్లు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే నిధులు కాజేశారు. ఇలా ఇప్పటి వరకు సుమారు రూ.39లక్షలు కాజేసినట్లు సీపీ వెల్లడించారు.

రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్

నకిలీ వేలిముద్రలతో నిధులు స్వాహా చేస్తున్నారనే సమాచారం అందడంతో రామగుండం సీపీ శ్రీనివాస్.. టాస్క్‌ఫోర్స్ పోలీసులను రంగంలోకి దింపారు. ఆఫీస్ ఇన్‌చార్జి దేవేందర్‌ను విచారణ జరపగా.. స్కాం వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో హైదరాబాద్‌కు చెందిన బి.మల్లికార్జున్, నర్సంపేటకు చెందిన షేక్ సలీంజాఫర్, పి.వెంకటేశ్వర్లు, మంచిర్యాలకు చెందిన దేవేందర్‌ను అరెస్ట్ చేశారు. ఫేక్ ఫింగర్ ప్రింట్స్, ఫేక్ ఫింగర్ ప్రింట్ తయారీకి వినియోగించిన మెటీరియల్, అభ్యర్థుల అటెండెన్స్ రిజిస్టర్, డాక్యుమెంట్, ల్యాప్‌టాప్, బయోమెట్రిక్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. స్కాంలో ముఖ్య సూత్రధారులైన భోపాల్‌కు చెందిన సాహిల్, హైదరాబాద్‌కు చెందిన అవునూరి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. రాష్ట్రంలో ఉన్న మరో రెండు, దేశంలో ఉన్న మిగతా కేంద్రాలపై కూడా పోలీసు శాఖ దృష్టి సారించింది.

టూరిజం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ 'నిథమ్' ఇనిస్టిట్యూషన్ గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిథమ్ ఇనిస్టిట్యూట్‌లో ఇంటర్ పాసైన వారు అర్హులని, బీబీఏ కోర్సు 4 సంవత్సరాలు, బీఎస్సీ 3 సంవత్సరాలు, ఎంబీఏ రెండేళ్ల కోర్సు, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. మిగతా వివరాలకు పర్యాటక శాఖ అధికారి 9440816071, 7842455581, 9553700035 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న పీఎస్సార్, వివేక్, వంశీ

దండేపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మైనార్టీ గురుకులంలో కలకలం

- విద్యార్థినితో వాచ్‌మెన్ అసభ్య ప్రవర్తన
- న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

బెల్లంపల్లి: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిపై సోమవారం వాచ్‌మెన్ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మైనార్టీ గురుకులంలో చదువుతున్న ఓ విద్యార్థిని ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒంటరిగా ఉండగా వాచ్‌మెన్ నిహాల్ ఆమె వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక వెంటనే విషయాన్ని ప్రిన్సిపాల్ షబానా అన్సారి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ప్రిన్సిపాల్ 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బ్లూకోల్ట్ పోలీసులు గురుకులానికి వెళ్లి బాలికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాచ్‌మెన్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సోమవారంతో పరీక్షలు ముగియడంతో తమకూతుళ్లను ఇంటికి తీసుకువెళ్లడానికి అప్పటికే గురుకులానికి చేరుకున్న సహచర బాలికల తల్లిదండ్రులు వారికి బాసటగా నిలిచారు. తమ కూతురికి జరిగిన అన్యాయంపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్యకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిందితుడు నిహాల్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న దొంగ అరెస్టు

- 14 సెల్‌ఫోన్లు, 29 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్

కాశిబుగ్గ: రైళ్లలో చోరీకి పాల్పడుతున్న దొంగను వరంగల్ రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.3.66 లక్షల విలువైన సెల్‌ఫోన్లు, బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం జిల్లా కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన దుర్గం ప్రశాంత్ సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడడంతో వచ్చే డబ్బులు సరిపోక చోరీలు చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈక్రమంలో వరంగల్‌కు వచ్చి ఓ ప్రైవేట్ హాస్టల్‌లో సెక్యూరిటీగా పని చేస్తున్నాని చెప్పి ఉంటూ రాత్రి వేళ రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. సోమవారం ఉదయం వరంగల్ రైల్వే స్టేషన్ 2, 3వ ప్లాట్‌ఫాంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేపడుతుండగా ప్రశాంత్ హ్యాండ్ బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. బ్యాగును తనిఖీ చేయగా 29 గ్రాముల బంగారం, 10 తులాల వెండి, ఒక వాచ్, 14 సెల్‌ఫోన్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని విచారించగా తాను వరంగల్ కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య పలు రైళ్లలో చోరీ చేసినట్లు పేర్కొన్నాడు. అతనిపై కేసు నమోదు చేసి సెల్‌ఫోన్లు, ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ నరేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ ఎస్సై ఐలయ్య, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్‌కె సుభాని, హెడ్ కానిస్టేబుల్ ఎస్ రాజు, ఎస్ రమేశ్, మనోజ్‌కుమార్, డి రాము, ఎండీ రియాజుద్దీన్ పాల్గొన్నారు.